



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 18-02-2024 సంపుటి : 06 సంచిక : 161 పేజీలు : 8 వెల : రూ 3-00


## ఎంపీ విజయసాయిరెడ్డికి 'సంసద్ మహారత్న' అవార్డు




ఢిల్లీ ఫిబ్రవరి17 ( విభారె) వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి సంసద్ మహారత్న అవార్డు అందుకున్నారు. ఎంపీ విజయసాయిరెడ్డికి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హాన్స్‌రాజ్ అహిర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అవార్డును ప్రదానం చేశారు.కాగా, టూరిజం, రవాణా, సాంస్కృతిక శాఖ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా విజయసాయిరెడ్డి అత్యుత్తమ పనితీరుకు గాను అవార్డు దక్కింది. ఇక, మాజీ చైర్మన్ టీజీ వెంకటేష్‌తో కలిపి ఎంపీ విజయసాయి రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. అలాగే, మహారాష్ట్ర సదన్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులను ఎంపీలు అధిర్ రంజన్ చౌదరి, సుప్రియ సులే, శ్రీకాంత్ ఏక్ నాథ్ షిండే, హీనా గవిట్, జయంత్ సిన్హా తదితరులు ఈ అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ..'మహిళలకు అన్ని రంగాల్లో సరైన అవకాశాలు కల్పించాలి. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ పాస్ చేయడం చరిత్రాత్మకం. పార్లమెంట్‌లో జరిగే చర్చలఆధారంగాచట్టాలఉద్దేశం తెలుస్తుంది. తెలంగాణ కొత్త రాష్ట్రానికి యంగ్ గవర్నర్ ఎలా పని చేస్తారని నా మీద విమర్శలు వచ్చాయి. కానీ, నా పనితీరుతో రెండో రాష్ట్రానికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అవకాశం వచ్చింది. గైనకాలజిస్ట్‌గా కొత్త శిశువు డెలివరీ చేసినట్లుగా తెలంగాణ కొత్త రాష్ట్రాన్ని కూడా సరిగ్గా నిర్వహించాను. పురుషులతో పాటు మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది అని కామెంట్స్ చేశారు.జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ ఆహిర్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో సమస్యలు లేవనెత్తాలి. ప్రభుత్వాన్ని సరైన దిశలో నడిపేందుకు ఎంపీలు నిరంతరం ప్రశ్నించాలి అని అన్నారు.

## ఏపీలో పొత్తులపై రానిస్పష్టత..

### అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..



అమరావతి, ఫిబ్రవరి17 ( విభారె) ఏపీలో ఎన్నికల వేళ త్యాగా లకు సిద్ధపడాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపార్టీనేతలకుతేల్చి చెప్పారు. పొత్తులు, సీట్ల సర్దుబాట్ల కారణంగా టికెట్లు రాని నేతలకు భవిష్యత్తులో ప్రాధాన్యత ఇస్తామంటూ భరోసా ఇచ్చారాయన.మరోవైపు సిట్టింగ్‌లకు సీట్లు ఖాయమని చంద్రబాబు గతంలోనే చెప్పారని బుచ్చయ్య చౌదరి తెలిపారు. జనసేనకు 40 సీట్లు రాబట్టాలని హరిరామజోగయ్య సూచిస్తుండగా బీజేపీ వ్యక్తే సీఎం అవుతారని విష్ణువర్ధన్ రెడ్డి చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే టీడీపీ- జనసేన కూటమిపొత్తులకుసహకరించిన నేతలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు. టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పొత్తుల కారణంగా టికెట్ రాలేదని ఏ ఒక్కరూ నిరుత్సాహపడొద్దన్నారు. పార్టీని నమ్ముకున్న నేతలకు అధికారంలోకి రాగానే గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. చాలామంది వైసీపీ నేతలు రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీలో చేరతామంటున్నారని చంద్రబాబు టీడీపీ నేతలతో చెప్పారు. పార్టీకి పనికొస్తారనుకునే వాళ్లనే టీడీపీలోకి తీసుకుంటున్నామన్నారు. నేతల చేరికలను ప్రోత్సహించి కలిసి పనిచేయాలని టీడీపీ నేతలకు సూచించారాయన.మరోవైపు టీడీపీలో సిట్టింగ్‌లందరికీ మళ్లీ సీట్లు ఖాయమన్నారు టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి. రెండేళ్ల క్రితమే చంద్రబాబు దీనిపై నిర్ణయం తీసుకున్నారని చెప్పారాయన. పొత్తుల్లో భాగంగా సర్దుబాట్లు కూడా ఉంటాయన్నారు. కనీసం 40 సీట్లు జనసేనకు రాబట్టాలని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామజోగయ్య తీవ్రంగా యత్నిస్తున్నారు. టీడీపీపై ఒత్తిడి పెంచేందుకు ఆయన ఈ విషయంలో లేఖలపై లేఖలు రాస్తు న్నారు. నియోజకవర్గాలను కూడా ఆయన సూచిస్తున్నారు. ఏపీలో 20 సీట్లు ఆశిస్తున్న కమలనాథులు బీజేపీ వ్యక్తే ఏపీ సీఎం అవుతారని విష్ణువర్ధన్ రెడ్డి జోస్యం చెబుతు న్నారు. బీజేపీ బలీయమైన పార్టీగా ఎదిగిందన్నారు. ఏపీలో ఎన్నికలకు గడువు సమీపిస్తున్నా టీడీపీ- జనసేన-బీజేపీ పొత్తులపై ఇంకా స్పష్టమైన ప్రకటన రాలేదు.

## 370 సీట్లు గెలవడమంటే ముఖర్జీకి నివాళి ఇవ్వడమే: ప్రధాని మోదీ




ఢిల్లీ ఫిబ్రవరి17( విభారె) : బీజేపీ పార్టీకి చెందిన ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఆ మీటింగ్‌లో ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి)మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఎలా ప్రచారం చేయాలన్న అంశాలను ఆయన తమ పార్టీ వర్గీయులకు దిశానిర్దేశం చేశారు. పేద ప్రజల కోసం తమ ప్రభుత్వంఎలాపనిచేసింది,దేశ అభివృద్ధి, ప్రపంచవ్యాప్తంగా భారత ర్యాంకింగ్ ఎలాపెరిగిందన్నఅంశాల ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 370సీట్లుగెలవడంతమపార్టీ సిద్ధాంత కర్త శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నిజమైన నివాళిఅవుతుందన్నారు. ఆర్టికల్ 370ని శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీతీవ్రంగా వ్యతిరేకించినట్లు మోదీ గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే ఆ ఆర్టికల్‌నుబీజేపీసర్కారు2019 ఆగస్టులో రద్దు చేసిన విషయం తెలిసిం దే. పోలింగ్ బూత్‌లపై దృష్టిపెట్టాలని ప్రధాని మోదీతమ పార్టీ ఆఫీస్ బేరర్లను కోరారు.

## జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం విజయవంతం?



సూళ్లూరుపేటఫిబ్రవరి17 ( విభారె) : జీఎన్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ వాహకనౌక 2,275 కిలోల బరువు గల వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్-3డీఎస్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టింది.తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఇవాళ సాయంత్రం 5.35 గంటలకు దీనిని ప్రయోగించారు. పదేళ్ల పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది.గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాలకు కొనసాగింపుగానే ఇన్‌శాట్-3డీఎస్‌ని పంపుతున్నట్లు ఇస్రో వెల్లడించింది. సుమారు 2,275 కిలోల బరువైన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పేలోడ్లున్నాయి. ఈ పేలోడ్లు వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరికల కోసం మెరుగైన వాతావరణ పరిశీలన, భూమి, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ విధులను చేపడతాయి.ప్రయోగం మొదలైన 20 నిమిషాల తర్వాత జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవో)లో శాటిలైట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం దశలవారీగా రెండు రోజులపాటు కక్ష్యను మారుస్తూ జియో స్టేషనరీ ఆర్బిట్‌లోకి మారుస్తారు.

## రైతుల సమస్యలపై దిగివచ్చిన కేంద్రం

### ఎంఎస్‌పీపై ప్యానెల్ ఏర్పాటుకు నిర్ణయం

### రైతుల నిరసన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం



ఢిల్లీ ఫిబ్రవరి17 ( విభారె) : పంటలకు మద్దతుధర(ఎం ఎస్‌పీ)తో సహా 12 హామీలను అమలు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు రైతులు ఆందోళన చేపట్టారు. 'ఢిల్లీ ఛలో'పేరుతో మార్చ్ నిర్వహించారు. అయితే, వీరిని హర్యానా-ఢిల్లీ సరిహద్దుల్లోనే పోలీసులు, కేంద్ర బలగాలు అడ్డుకున్నాయి. మరోవైపు రైతులతో కేంద్ర మంత్రులు పలుమార్లు చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. చర్చల కోసం రైతు సంఘాల ప్రతినిదుల పేర్లను కూడా కమిటీ కోరే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. రైతుల డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ రంగంలో పని చేస్తున్న ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో సహా వాటాదారులతో చర్చలు అవసరమని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ప్రస్తుతం పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభు మరియు ఖనౌరీ పాయింట్ల వద్ద రైతులు నిరసన తెలుపుతున్నారు. అక్కడే క్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. కీలక డిమాండ్ అయిన ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ ఇవ్వడంపై కేంద్రం ఆర్డినెన్స్ తీసుకురావాలని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ శనివారం డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్ రైతు నేతలతో మూడుసార్లు చర్చించారు. ఆదివారం నాలుగో విడత చర్చించనున్నారు.

## పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ గ్రీన్ సిగ్నల్

### ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి

### అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్న ఎన్నికల ప్రధాన అధికారి

### ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 50% పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్

ఢిల్లీ ఫిబ్రవరి17 ( విభారె) :: త్వరలో దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పార్లమెంట్ అలాగే ఆయా రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా చేయాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు రాజీవ్ కుమార్ చెప్పుకొచ్చారు.ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 50% పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. 22,685 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 300 పోలింగ్ స్టేషన్లు వికలాంగుల కోసం ఏర్పాటు చేసినట్లు రాజీవ్ కుమార్ చెప్పుకొచ్చారు. వచ్చే నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి మే నెలలో రిజల్ట్స్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే దేశ వ్యాప్తంగా ఆయా పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఓ వైపు ఎన్డీఏ.. ఇంకోవైపు ఇండియా కూటమి ఎన్నికల్లో గెలుపు కోసం ప్రణాళికలు రచిస్తున్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీ వేదికగా కమలనాథులు సమావేశమయ్యారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలుపొందడం కోసం ఏం చేయాలన్నదానిపై మేథోమదనం చేస్తున్నారు. ఇప్పటికే మోడీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమికి 400 సీట్లు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఇంకోవైపు విపక్ష పార్టీలు కూడా ఇండియా కూటమిగా ఏర్పడ్డారు. కానీ.. వారిలో ఐక్యత లోపించింది.

# చరిత్రలో మొదటిసారి రాజ్యసభకు దూరం

విజయవాడ, ఫిబ్రవరి 17దాదాపు 42 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీకి తొలిసారి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేకుండా పోతోంది.ప్రస్తుతం రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది.టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రకుమార్ రాజ్యసభ నుంచి ఏప్రిల్లో రిలీవ్ అవుతుండగా, ఆ స్థానానికి ఆ పార్టీ పోటీ పడే అవకాశం ఉందని ఇంతకుముందు వార్తలు వచ్చాయి.కానీ సాధారణ ఎన్నికల ముంగిట సాహసాలకు పోకూడదని పార్టీ అధినాయకత్వం నిర్ణయించడంతో ప్రధాన ప్రతిపక్షం పోటీకి దూరమయ్యింది. దాంతో అధికార వైఎస్సార్సీపీకి ఈసారి మూడు సీట్లు ఏకగ్రీవంగా దక్కనున్నాయి.వైఎస్సార్సీపీ అభ్యర్థులు వేసిన నామినేషన్లను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) ముకేశ్ కుమార్ మీనా ఫిబ్రవరి 16న ఆమోదించారు.తెలుగుదేశం పార్టీని 1982 మార్చి 29న నందమూరి తారక రామారావు ప్రారంభించారు.ఎన్టీఆర్ నాయకత్వంలో 1983లో తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, 1984లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బోణీ కొట్టింది. ఆ పార్టీ తరపున ఐదుగురు ఎగువసభకు ఎన్నికయ్యారు. వారిలో పర్వతనేని ఉపేంద్ర, బి. సత్యన్నారాయణ రెడ్డి, పి రాధాకృష్ణన్, ప్రొఫెసర్ సి.లక్ష్మన్న, ఎల్లా శశిభూషణ్ రావు ఉన్నారు.1984 ఏప్రిల్ 10న ఈ ఐదుగురు టీడీపీ తరపున ఎగువ సభలో అడుగుపెట్టడంతో ఆ పార్టీ ప్రాతినిధ్యం మొదలయ్యింది. తొలిసారి రాజ్యసభలో ప్రవేశించిన టీడీపీ ఎంపీల్లో ఉపేంద్ర, సత్యన్నారాయణ రెడ్డి వరుసగా రెండు దఫాలు అవకాశం దక్కించుకున్నారు.అదే ఏడాది ఇందిరా గాంధీ మరణానంతరం జరిగిన లోక్ సభ ఎన్నికల్లోనూ టీడీపీ హవా కొనసాగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో42 సీట్లకు 30 స్థానాలను తన ఖాతాలో వేసుకుని, అధికార కాంగ్రెస్ తర్వాత లోక్‌సభలో అత్యధిక సీట్లు గెలుపొందిన పార్టీగా జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది.టీడీపీ తరపున 1984 నుంచి 2024 వరకు మొత్తం 44 మంది రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. వారిలో సినీ ప్రముఖులు కూడా ఉన్నారు.సినీ నటులు రావు గోపాలరావు, మోహన్ బాబు, జయప్రద వంటి వారు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. సుజనా చౌదరి వంటి వారు రాజ్యసభ సభ్యులుగానే టీడీపీ తరుపున కేంద్ర మంత్రులు కూడా అయ్యారు.టీడీపీ చెందిన వారే కాకుండా మిత్రపక్షాలకు కూడా మద్దతు ఇచ్చి రాజ్యసభకు పంపించిన చరిత్ర టీడీపీది. సీపీఐ, సీపీఎంలకు చెందిన పలువురు నేతలు రాజ్యసభలో అడుగు పెట్టేందుకు టీడీపీ మద్దతిచ్చింది.2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత బీజేపీతో పొత్తులో భాగంగా అప్పటి కేంద్ర మంత్రులు సురేష్ ప్రభు, నిర్మలా సీతారామన్ వంటి వారికి కూడా ఏపీ నుంచి రాజ్యసభ అవకాశాలు కల్పించింది.ఉమ్మడి రాష్ట్రంలోనూ, విభజన తర్వాత కూడా అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా ప్రతీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం కనపడేది.ఒకనాడు అనేక పార్టీలు టీడీపీ మద్దతుతో రాజ్యసభలో ప్రవేశించగా, ఇప్పుడు టీడీపీకే రాజ్యసభలో బెర్త్ లేకుండాపోయే, అసలు పోటీకే వెనకాడే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా అసెంబ్లీలో బలం ఆధారంగానే రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో 2019 ఎన్నికల తర్వాత టీడీపీకి కష్టకాలమొచ్చింది.టీడీపీ తరపున 23 మంది మాత్రమే ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో రాజ్యసభ ఎన్నికల్లో సీటు దక్కించుకునే అవకాశం కోల్పోయింది. వరుసగా మూడు ఎన్నికల్లో- 2020, 2022, 2024లలో టీడీపీకి అవకాశం లేకుండా పోయింది.2020లో నాలుగు సీట్లకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిని బరిలో దింపినా ప్రభావం చూపలేకపోయింది. ఇక ప్రస్తుత ఎన్నికలతోపాటు 2022లోనూ టీడీపీ పోటీకి దూరంగా ఉండిపోవడంతో ఏకగ్రీవంగా వైఎస్సార్సీపీ ఖాతాలో మొత్తం రాజ్యసభ స్థానాలు చేరిపోయాయి.టీడీపీ తరపున రాజ్యసభకు ఎన్నికైనవారు అనేక మంది ఆ తర్వాత ఆ పార్టీకి దూరమైన అనుభవాలు కూడా ఎక్కువే ఉన్నాయి. అధికారంలో ఉండగా రాజ్యసభ అవకాశాలు దక్కించుకుని విపక్షంలో చేరగానే పార్టీ మారిపోయిన నేతల జాబితా కూడా పెద్దదే. నాలుగేళ్ల క్రితం 2020లో టీడీపీకి రాజ్యసభలో ఐదుగురు సభ్యులు ఉండగా అందులో నలుగురు ఒకేసారి బీజేపీ పక్షాన చేరిపోయారు. ఆ పార్టీ కండువాలు కప్పేసుకుని ఏకంగా టీడీపీ రాజ్యసభ పక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్టు ప్రకటించేశారు.సీఎం రమేష్, సుజనా చౌదరి, టీజీ వెంకటేష్, గరికపాటి మోహనరావు పార్టీ ఫిరాయించేయడంతో టీడీపీకి కేవలం ఒకే ఒక్కరు మిగిలారు. నాలుగేళ్లుగా కనకమేడల రవీంద్రకుమార్ మాత్రమే రాజ్యసభలో టీడీపీ గొంతు వినిపిస్తూ వచ్చారు.ఏప్రిల్లో ఆయన కూడా రిలీవ్ అవుతుండటంతోనే టీడీపీకి రాజ్యసభలో అవకాశం లేకుండా పోతోంది.అంతకుముందు కూడా టీడీపీ తరపున గెలిచి, ఇతర పార్టీల్లో చేరిన వారిలో రేణుకా చౌదరి, దేవేందర్ గౌడ్, సి.రామచంద్రయ్య,
ఎంవీ మైసూరారెడ్డి లాంటి రాజకీయ ప్రముఖులు ఉన్నారు.2024 సాధారణ ఎన్నికలకు ముందే ప్రస్తుతం రాజ్యసభ ఎన్నికలు ముగుస్తున్నందున మళ్లీ టీడీపీకి అవకాశం రావాలంటే మరో రెండేళ్లు వేచి చూడక తప్పదు.రాజ్యసభ సీట్లు దక్కించుకోవడమనేది రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మీద ఆధారపడి ఉంటుంది.2026లో జరగబోయే రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో ఏపీ నుంచి నాలుగు స్థానాలు ఖాళీ అవుతాయి. అందులో పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, ఆళ్ల అయోధ్య రామిరెడ్డితోపాటు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీకి సన్నిహితుడైన పరిమళ్ నత్వానీ ఉంటారు.ఆంధ్రప్రదేశ్‌కు రాజ్యసభలో మొత్తం 11 స్థానాలు ఉండగా, తాజా పరిణామాలతో అన్ని స్థానాలు వైఎస్సార్సీపీ ఖాతాలో చేరుతున్నాయి. ఏపీ చరిత్రలో రాజ్యసభ స్థానాలన్నీ ఒకే పార్టీ ఖాతాలో ఉండటం ఇదే తొలిసారి కానుంది.2024 సాధారణ ఎన్నికల్లో తమ పార్టీ పుంజుకుంటుందని, తదుపరి రాజ్యసభ ఎన్నికల్లో కచ్చితంగా అవకాశం దక్కుతుందని టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు.

## స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అప్రూవర్

విజయవాడ, ఫిబ్రవరి 17 అవినీతి కేసుల్లో చంద్రబాబు బెయిల్ పై బయట ఉన్నారు.ం రాజకీయ కార్యకలాపాల్లో బిజీగా ఉన్నారు. సరిగ్గా ఇటువం టి సమయంలోనే మరోసారి స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసు బయటకు వచ్చింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న చంద్రకాంత్ షా అనే వ్యక్తి అప్రూవర్ గా మారుతాడని ఏసీబీ హైకోర్టుకు నివేదించింది. విచారణకు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్ స్వీకరించిన కోర్టు విచారణను మార్చి 1కి వాయిదా వేసింది.దీంతో చంద్రబాబు కేసు అంశం మరోసారి వెలుగులోకి వచ్చింది.స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసులో చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. దాదాపు 52 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కింది కోర్టు నుంచి పై కోర్టు వరకు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు అక్రమమని, కనీస నిబంధనలు పాటించలేదని పిటిషన్ లో పేర్కొన్నారు.

## కాకినాడ పార్లమెంట్ లో... అన్ని కాపులకేనా

కాకినాడ, ఫిబ్రవరి 17 తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలపై వైసీపీ ఫోకస్ చేసింది. ఈ రెండు జిల్లాల్లో మెజార్టీ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో కాపులకు ప్రాధాన్యత ఇస్తోంది. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో...ఆరు సీట్లను కాపులకే కేటాయించేసింది. మిగిలిన సామాజిక వర్గాలు టికెట్ కావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోరుతున్నా...కుదరదని ముఖం మీద చెప్పేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రమంతటా ప్రయోగాలు చేస్తున్న వైసీపీ...కాకినాడ పార్లమెంట్ పరిధిలో మాత్రం కాపులకే పెద్ద పీట వేయడం చర్చ నీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటవ ములను బేరీజు వేసుకుంటున్న ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి... ఎక్కడికక్కడ సీట్లు చించేస్తున్నారు. ఇప్పటి దాకా 72 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాలు కూడా ఉన్నాయి. అధికార పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో కమ్మ, కాపు, రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి బీసీలకు ప్రాధాన్యత కల్పించింది. కాకినాడ జిల్లాలో మాత్రం ఎలాంటి ప్రయోగాలు చేయడం లేదు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019లో ఒక్క కాకినాడ సిటీ మినహా మిగతా ఆరు చోట్ల కాపులకు అవకాశం ఇచ్చింది వైసీపీ. పెద్దాపురం నియోజకవర్గం సీటు మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో ఆ పార్టీ జెండా ఎగిరింది. ఇక్కడ టీడీపీ తరపున నిమ్మకాల య చినరాజప్ప గెలుపొందారు. కాకినాడ పార్లమెంట్ సీటు పరిధిలో దాదాపు 60 శాతం కాపు ఓటర్లు ఉన్నారు. ఈ సారి కూడా అభ్యర్థుల్ని మాత్రమే మార్చింది తప్ప సామాజిక సమీకరణల్ని మార్చేందుకు ప్రయత్నించలేదు. కాకినాడ జిల్లాలో బీసీ నేతలు తమకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరినా వైసీపీ హైకమాండ్ పరిగణలోకి తీసుకోలేదు. . దీంతో లేనిపోని తలనొప్పు లు తెచ్చుకోవడం కంటే కాపులకే సీటు కేటాయిస్తే ఎలాంటి టెన్షన్ ఉండదని భావించింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు సీట్లను కాపులకే కేటాయించింది. కారణం ఏంటంటే కాకినాడ పార్లమెంట్ పరిధిలో జనసేన ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైసీపీ అంచనా వేస్తోంది.

# టీడీపీలోకి లావు....



గుంటూరు, ఫిబ్రవరి 17 సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఏపీలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. వైసీపీ చేపట్టిన రాజకీయ బదిలీలపై అసంతృప్తిగా ఉన్న కొందరు నేతలు అధికార పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పక్షాన కొందరు చేరగా.. మరికొందరు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేసిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. త్వరలోనే ఆయన సైకిల్ ఎక్కనున్నారని ప్రచారం జరుగుతోంది.పొత్తుల వ్యవహారం, సీట్ల కేటాయింపు కొలిక్కి వస్తుండటంతో తెలుగుదేశం( అధినేత చంద్రబాబు నివాసం వద్ద కొద్ది రోజులుగా సందడి వాతావరణం నెలకొంది. వివిధ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున నేతలు టీడీపీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఆయా నియోజకవర్గాల బాధ్యులు వారిని తాడేపల్లికి పంపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకుంటున్న కీలక నేతలు సైతం వారి అనుచరగణంతో అక్కడికి చేరుకుని అధినేతతో సంప్రదింపులు జరుపుతున్నారు. దీంతో వారం, పదిరోజులుగా ఆయన నివాసం వద్ద జనం తాకిడి పెరిగింది. తెలుగుదేశంపార్టీలో చేరికల్లో భాగంగా నరసరావుపేట వైసీపీ మాజీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. ఇటీవలే ఎంపీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసిన ఆయన... త్వరలోనే తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా ఆయన అభిమానులు తెలుగుదేశం ఫ్లెక్సీలతో నింపేశారు. ఈనెల 22న ఆయన సైకిల్ ఎక్కనున్నట్లు సమాచారం. నరసరావుపేట ఎంపీ టిక్కెట్ పై హామీ వచ్చిన తర్వాతే ఆయన వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిసింది. కొంతకాలంగా వైసీపీ అధిష్టానం తీరుపై అసంతృప్తిగా ఉన్న లావు.... పార్టీ కార్యక్రమాల్లోనూ అంటీముట్టనట్లుగానే పాల్గొంటున్నారు.వైసీపీ అధినాయకత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన అమరావతి రైతులకు మద్దతు సైతం తెలిపారు. అప్పటి నుంచే ఆయనకు పార్టీతో సత్సంబంధాలు తెగిపోయాయని సమాచారం. పైగా నరసరావుపేట సీటును వేరొకరికి ఇస్తామని...గుంటూరు నుంచి ఈసారి పోటీ చేయాల్సిందిగా జగన్ ఆయనకు సూచించారు. తాను నరసరావుపేట నుంచే బరిలో ఉంటానని లావు తెగేసి చెప్పారు. దీనిపై వైసీపీ అధిష్టానం నుంచి ఎలాంటి సానుకూల నిర్ణయం రాకపోవడంతో ఆయన ఆ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అంతకు ముందే ఆయనకు తెలుగుదేశం నుంచి ఎంపీ టిక్కెట్ ఆఫర్ వచ్చింది. అందులో భాగంగానే ఆయన చంద్రబాబును కలిశారు. త్వరలోనే లావు శ్రీకృష్ణ దేవరాయులు పసుపు కండువా కప్పుకోవడం ఖాయమని తేలిపోయింది. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులతోపాటు పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు తెలుగుదేశంలో చేరనున్నారు. ఆ పార్టీ సీనియర్ నేత అట్లా చిన్న వెంకట్ రెడ్డి వంద కార్లతో భారీ కాన్వాయ్ తో చంద్రబాబు నివాసం వద్దకు చేరుకున్నారు. వీరితో వివిధ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు చెప్పిన 24గంటల్లోనే ఆ పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు కలవడం వైసీపీని కలవరపెడుతోంది.

## లోకేష్ పై కాండ్రూ కమలే పోటీనా...

గుంటూరు, ఫిబ్రవరి 17 : ఆంధ్రప్రదేశ్ లో వీఐపీ నియోజకవర్గాల్లో ఒకటి మంగళగిరి. అక్కడ్నుంచి నారా లోకేష్ మరోసారి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఐదు వేల ఓట్ల తేడాతో ఓడిపోయినా పట్టుదలగా ఐదేళ్లుగా అక్కడి నుంచే పని చేసుకుంటున్నారు. సొంత డబ్బులతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల్లో తిరిగారు. ఇప్పుడు తనకు యాభై వేల మెజార్టీ వస్తుందని ధీమాగా చెబుతున్నారు. అయితే ఆయనకు ప్రత్యర్థిని ఎంపిక చేయడంలో మాత్రం వైఎస్ఆర్సీపీ తడబడుతోంది. మంగళగిరిలో గత రెండు సార్లు వైసీపీ అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో అమరావతి సెంటిమెంట్‌తో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పోటీ చేసినప్పటికీ.. మంగళగిరిలో వైసీపీ హవేనే కొనసాగింది. ఈ సారి కూడా లోకేశ్ అక్కడ నుంచే పోటీకి సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేగా రెండో సారి గెలిచిన ఆర్కే పార్టీని వీడటంతో మంగళగిరిలో బీసీ కార్డు ప్రయోగానికి తెర లేపారు సీఎం జగన్.. స్థానికంగా చేనేత వర్గీయుల ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో.. అదే వర్గానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవిని ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన చిరంజీవి ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని అందరూ భావించారు. కానీ ఆయన అందర్నీ కలుపుకోలేకపోతున్నారని.. బలంగా పోటీ ఇవ్వలేరన్న రిపోర్టులు రావడంతో ప్రత్యామ్నాయ అభ్యర్థి వైపు చూస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మాజీ మంత్రి మురుగుడు హన్మంతరావు కూడా వైసీపీ టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. సమన్వయకర్తగా చిరంజీవిని నియమించిన దగ్గర్నుంచి ఆయన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని కలవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. అవి విఫలం అవ్వడంతో ఎమ్మెల్యే అనుచర గణాన్ని ప్రసన్నం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలు కూడా బెడిసి కొట్టాయి. నియోజకవర్గంలో ప్రతి గడపగడపకు వెళుతూ ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఆశించిన ఆదరణ లభించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. బీసీ నేత గంజి చిరంజీవి తన ప్రయత్నాల్లో తాను ఉంటే.. అదే వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల టికెట్ రేసులోకి వచ్చి వైసీపీ పెద్దలతో చర్చించారు. కమలతోపాటు మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సైతం తన కోడలిని ఎన్నికల బరిలో దించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరో వైపు నియోజవర్గంలో అభ్యర్తిని వారంలో ఖరారు చేస్తామని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. నియోజకవర్గంలో పర్యటించిన ఆయన తో గంజి చిరంజీవితో పాటు కాండ్రు కమల కూడా ఉన్నారు. ఇద్దరిలో ఒకరిని ఖరారు చేస్తారా లేకపోతే.. లోకేష్ కు గట్టి పోటీ ఇవ్వాలన్న లక్ష్యంతో ఎవరినైనా హఠాత్తుగా రంగంలోకి తెస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## అప్పుడు ప్రత్యర్థులు ఇప్పుడు మిత్రులు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 17 విశాఖ తూర్పు నియోజకవర్గంలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఒకప్పుడు విజయం కోసం పోటీ పడిన ఆ ఇద్దరు నేతలు ఇప్పుడు ఒకటయ్యారు. మరో నేతపై ఇరువురు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకప్పుడు రాజకీయంగా పోటీ పడి, ఇప్పుడు ఏకతాటికిపై వచ్చిన ఆ ఇద్దరి నేతలే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్. ఈ ఇద్దరు నేతలకు ఒకరంటే ఒకరికి పడదు. ఇద్దరు నేతలు సుమారు 15 ఏళ్లపాటు రాజకీయంగా ఒకరిపై మరొకరు పోరాటాన్ని సాగించారు. రెండు ఎన్నికల్లో ప్రత్యక్షంగా ఇరువురు నేతలు పోటీ పడ్డారు. రోజులు మారాయి. రాజకీయాలు మారాయి. ఇద్దరు నేతలు ఒక్కటయ్యారు. ఇప్పుడు మరో నేతపై ఇద్దరు నేతలు కత్తులు దూస్తున్నారు. గడిచిన మూడు ఎన్నికల్లో ఎమ్మెల్యే వెలగపూడి ఓటమికి కంకణం కట్టుకున పని చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్.. ఇప్పుడు అదే వెలగపూడిని గెలిపించాలని కోరుతున్నారు. ఇదే ఇప్పుడు తూర్పు నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది.విశాఖ తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు మూడు ఎన్నికలు జరగ్గా, మూడుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన వెలగపూడి రామకృష్ణబాబు ఇక్కడ విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో వెలగపూడిపై పోటీ చేసిన వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఓటమి పాలయ్యారు. 2009లో తొలిసారి ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ 4031 ఓట్ల తేడాతో వెలగపూడిపై ఓటమి పాలయ్యారు. రెండోసారి 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన వెలగపూడి మరోసారి విజయాన్ని దక్కించుకున్నారు.

# కర్నూలులో మార్పులు మంటలు

కర్నూలు, ఫిబ్రవరి 17,సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీఅధిష్టానం ఎడాపెడా అభ్యర్థులను మార్చేస్తుండటంతో ఆశావహుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. దశాబ్దాలుగా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకున్న నేతలకు సైతం స్థానచలనం తప్పడం లేదు. టిక్కెట్ ఆశిస్తున్న నేతలే గాక...ఆయా నియోజకవర్గాల కార్యకర్తల్లోనూ ఆందోళన నెలకొంది. అధిష్టానం నిర్ణయంతో వారు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు నియోజకవర్గాల తో పాటు ఒక ఎంపీ స్థానంలో అభ్యర్థులను మార్చారు. అధిష్టానం నిర్ణయంపై ఆయా నియోజకవర్గాల్లోని ఓ సామాజిక వర్గం కార్యకర్తలు మాత్రం భగ్గుమంటున్నారు. ఇంతకీ ఆ నియోజకవర్గాలు ఏంటో...అక్కడి పరిస్థితులు ఎంటో ఒకసారి తెలుసుకుందాం...గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 14 సీట్లను తన ఖాతాలో వేసుకుని రాయలసీమలో తిరుగులేదనిపించింది. అయితే జిల్లాలో ఉన్న రెండు రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థులను వైసీపీఅధిష్టానం మార్చడంపై ఆ సామాజిక వర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. కోడుమూరు ఎమ్మెల్యేగా జై సుధాకర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆర్థర్ ను పక్కనపెట్టేసి కొత్తవారికి అవకాశం కల్పించింది. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని కేవలం వెనకబడిన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలనే మార్చడం ఏంటని వారు అనుచరులు ప్రశ్నిస్తున్నారు. కోడుమూరు ఎమ్మెల్యే గా ఉన్న సుధాకర్ తొలిసారి ఎమ్మెల్యే గా విజయం సాధించి నియోజకవర్గంలో ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. అయితే వైకాపా నేత హర్షవర్ధన్ రెడ్డి తో తలెత్తిన విభేధాల కారణంగానే ఆయన్ను పక్కనే పెట్టేశారని తెలుస్తోంది. వీరిద్దరి మధ్య పలుమార్లు రాజీ కుదిర్చినా ఎవరికి వారే అన్న చందంగా నియోజకవర్గంలో వ్యవహరించారు. మరోసారి సుధాకర్ కు అవకాశం కల్పిస్తే...తాము అండగా ఉండమని హర్షవర్ధన్ రెడ్డి వర్గం హెచ్చరించంతోనే ఆయన స్థానంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ సోదరుడు ఆదిమూలపు సతీశ్ ను తీసుకొచ్చారు. దీనిపై సుధాకర్ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. స్థానికేతరుడికి ఏమాత్రం సహకరిస్తారన్నది అనుమానమే. ఉమ్మడి కర్ను?లు జిల్లాలో మరో రిజర్వుడు నియోజకవర్గం నందికొట్కూరు) ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఆర్థర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈయనకు శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తో విభేదాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఆర్థర్ ఉన్నా...పెత్తనం మొత్తం బైరెడ్డిదే . పెద్దలు పలుమార్లు రాజీ కుదుర్చే ప్రయత్నాలు చేసినా ఫలించలేదు . ఇవేమీ పట్టించుకోని ఆర్థర్ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేసినప్పటికీ ఎమ్మెల్యే కు ఉన్న అధికారాలను పూర్తిగా లాగేశారు. ఐపాక్ నిర్వహించిన సర్వేలో ఆర్థర్ పనితీరు బాగుందని తేలినా..పక్కన పెట్టేశారు. ఎందుకంటే బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మద్దతు లేకుండా ఈ నియోజకవర్గంలో వైసీపీ గెలుపు అంత సులువు కాదు. ఈ విషయం జిల్లాలో అందరికీ తెలిసినా...ఆర్థర్ మాత్రం ఎందుకో అతనితో సఖ్యంగా ఉండలేకపోయారు. దీంతో కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుదీర్ ను నియోజకవర్గం కొత్త సమన్వయ కర్తగా నియమించారు. దీనిపై ఆర్థర్ వర్గంతోపాటు అటు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వర్గం అసంతృప్తిగా ఉంది. తాను సూచించిన వారికే టిక్కెట్ ఇవ్వాలని బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పట్టుబట్టినా...జగన్ కడప నుంచి స్థానికేతర అభ్యర్థిని తీసుకొచ్చి నిలబెట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న రెండు రిజర్వుడు సీట్లలో ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వకుండా మొండి చేయి చూపడమే గాక..స్థానికే తరులను తీసుకొచ్చి ఇక్కడ నిలపడంపై లోకల్ కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. ముఖ్యంగా రిజర్వడ్ సామాజికవర్గం శ్రేణులు దీన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

## నెల్లూరు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ...

నెల్లూరు, ఫిబ్రవరి 17 నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూతో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో, పశు సంవర్ధక శాఖ అధికారులు, యంత్రాంగం అప్రమత్తమయ్యారు. కోళ్లకు సంబంధించిన శాంపిల్స్ ను భోపాల్ లోని టెస్టింగ్ కేంద్రానికి పంపించారు. నెల్లూరులోని చాటగుట్ల, గుమ్మళ్లదిబ్బలో వేలాది కోళ్లు చనిపోయాయి. వీటిని పరిశీలించిన అధికారులు బర్డ్ ఫ్లూతోనే మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. కోళ్ల కళేబరాల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపించారు.

## శ్రీశైల దేవస్థాన శాశ్వత అన్నప్రసాద వితరణ కు భక్తుల విరాళం..



విభారె న్యూస్ ఫిబ్రవరి 17 శ్రీశైలం..శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రతి నిత్యం భక్తులకు జరిగే అన్నప్రసాద వితరణ కు గాను 17.02.2024 తేదీన శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం గా రూ. 5,00,000/-లను ఎం. మనోహర్ రెడ్డి, హైదరాబాద్ వారు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్, పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది. దేవాలయం వారు వీరికి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి శాలువాతో సత్కరించి స్వామిఅమ్మవార్లలడ్డూప్రసాదంను,చిత్రపటాన్నిఅందజేశారు...

## ఖాళీ చేయుటకు నేడు తుది గడువు

### నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 17-బొగ్గు లైన్ లో ఆర్ అండ్ బి రహదారి ఆక్రమణదారులకు ఆదివారం ఖాళి చేయుటకు తుది గడువు అని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అర్ అండ్ బి రహదారి వెంట బొగ్గు లైన్ లో కొందరు గుడిసెలు వేసి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు . పట్టణ అభివృద్ధి కోసం రోడ్డు విస్తరణ పనులు చేయాల్సి ఉంది. వారి సమ్మతి తో వారు కోరిన విధముగా వారికి ఇంటి స్థలాలు మరియు టిడ్కో గ్రుహలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు విడతలుగా మే నెల మరియు నవంబర్ నెలల్లో పట్టాల పంపిణీ చేయడమైనది .పంపిణీ చేసి నేటికీ ఎనిమిది నెలలు అయినప్పటికీ రోడ్డు ఆక్రమణల్లో ఉన్న ఇంటిని ఖాళీ చేయటం లేదన్నారు . పట్టా జారీ చేసిన వెంటనే ఇల్లు ఖాళీ చేసి వెళ్తామని చెప్పారని అన్నారు . అధికారులకు ఆక్రమణలు తొలగించుటకు సహకరిస్తామని రాతపూర్వకముగా అంగీకార పత్రమును తహసిల్దార్ కు సమర్పించి ఉన్నారు. వెంటనే ఇండ్లను ఫిబ్రవరి నెల 18 తేదీ సాయంత్రం లోపు ఖాళీ చేసి అధికారులకు సహకరించవలసినదిగా మున్సిపల్ కమిషనర్ కోరారు. ఖాళీ చేయని యెడల తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## మహా శివరాత్రికి కర్నూలు నుండి ప్రత్యేక బస్సులు..



విభారె న్యూస్ ఫిబ్రవరి 17 కర్నూలు..మహా శివరాత్రికి వెంకటాపురం,శ్రీశైలం, మహానంది పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా సంస్థ ఈడీ (కడప) జి.వెంకటేశ్వరరావు అధికారులకు ఆదేశించారు. బస్సుల ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లాలోని వివిధ బస్ స్టేషన్ల మేనేజర్లతోశనివారంఆయనసమీక్షాసమావేశం నిర్వహించారు. భక్తులుసౌకర్యవంతంగాక్షేత్రాలకువెళ్లేందుకు అవసరమైన మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు

### నేడు మాఘ శుద్ధ నవమి సందర్భంగా సూర్య దేవాలయంలో శ్రీ రాజ శ్యామల సహస్ర నామ హోమం..

విభారె న్యూస్ ఫిబ్రవరి 17 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..మాఘశుద్ధ నవమి ఆదివారం 18.02.2024 శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహా గౌరీ అమ్మవారికి జరిగిన రాజశ్యామల నవరాత్రులు సందర్భంగా ఉదయం 9.30 గంలకు లక్ష్మీ గణపతి, నవగ్రహ, అంగ, ఉపాంగ, ప్రత్యంగ, దేవత సహిత శ్రీ రాజశ్యామల మూలమంత్ర హోమ సహిత శ్రీ రాజశ్యామల సహస్రనామ హోమం జరుపబడును. ఈ అమ్మ అనుగ్రహం వలన ఉన్నత పదవీ, ఉద్యోగ, విద్యా, వ్యాపార, లాభాలు పొందవచ్చును. సకల దాంపత్య శత్రు, రుణ, రోగ, బాధలు, తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించును. హోమంప్రధానంగా-4000/- సంకల్పం -116/- సంప్రదిం చవలసిన నెంబరు.. డి లక్ష్మీనరసింహ శర్మ.. 8008774086దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు :8896123777

# జగనన్న పథకాలు మహిళా లోకానికి ఉపాధి లభ్యం

**ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి...**
**మహిళకు పెద్దపీట వైసీపీతోనే సాధ్యం..**
**ఎమ్మిగనూరు సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక..**

విభారె న్యూస్ ఫిబ్రవరి 17 ఎమ్మిగనూరు. 17-02-2024 తేదీన ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండల కేంద్రంలోని జరిగిన నవరత్నాలు అమలులో భాగంగా -నాలుగవ విడత ఆసరా కార్యక్రమంలో స్థానిక ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగనూరు వైస్సార్సీపీ సమన్వయకర్త శ్రీమతి. బుట్టా రేణుక లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నవరత్నాలు అమలులో భాగంగా 11-04-2019 నాటికి స్వయం సహాయక సంఘాల యొక్క బ్యాంకు లింకేజీ అప్పు నిలువను వైయస్సార్ ఆసరా పథకం ద్వారా తిరిగి చెల్లించాలని నిర్ణయించింది. కర్నూలు జిల్లాలోని నందవరం మండలంలో 11-04-2019 నాటికి బ్యాంకు లింకేజీ అప్పు నిలువ ఉన్న



స్వయం సహాయక సంఘాలు 648 సభ్యులు 6,480 మంది మొత్తము 10 కోట్ల 40 లక్షల రూపాయలు ఈ మొత్తము నాలుగు విడతలగా స్వయం సహాయక సంఘం ఖాతాలో జమ చేయడం జరుగుతున్నది. ఇప్పటికే మూడు విడతలలో 648 స్వయం సహాయక సంఘాలు 6480 మంది సభ్యులకు మొత్తము 7 కోట్ల 80 లక్షల రూపాయలు సహాయక సంఘాల ఖాతాలో జమ చేయడం జరిగినది. ప్రస్తుతము చివరి మరియు నాలుగవ విడత గా గౌరవ ముఖ్యమంత్రి 23-01-2024 న ఈ వై యస్ ఆర్ ఆసరా కార్యక్రమమును ప్రారంభించడం జరిగినది. మన నందవరం మండలంలో ఈరోజు అనగా 17-02-2024వ తేదీన 648 స్వయం సహాయక సంఘాల ఖాతాలకు 2 కోట్ల 60 లక్షల రూపాయలు జమ చేయడం జరుగుచున్నది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు విరూపాక్షి రెడ్డి, జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, కో ఆప్షన్ మెంబెర్ షేక్ మహమ్మద్, మండల జేసియన్ కన్వీనర్ చాంద్ బాషా,ఎంపీటీసీలు, సర్పంచులు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు నందవరం మండల అధికారులు తహశీల్దార్, ఎంపీడీఓ,డియర్ డిఓ పీడీ, డియర్ డిఓ ఎపిఎం తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇస్తే శిక్షలు తప్పవు :జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 17-మైనర్లకు మరియు లైసెన్స్ లేనివారికి ఏదైనా వాహనం (మోటార్ సైకల్ ,కారు ) మరి ఏ ఇతర వాహనం నడపడానికి ఇస్తే ఒకవేళ సదరు వాహనం వల్ల ఏదైనా ప్రమాదం జరిగి ఎవరి మరణానికి కారణమైతే సదరు వాహనం ఇచ్చిన యజమానితల్లిదండ్రులుగార్డియన్ లపై 304 ఐపీసీ క్రింద మరియు ఏదైయన గాయాలకు కారణమైతే సదరు వాహనం ఇచ్చిన యజమానితల్లిదండ్రులుగార్డియన్ లపై 308 ఐపీసీ క్రింద కేసులు నమోదు చేయబడతాయని .కావునమైనర్లకు మరియు లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించడమైనది. వాహనాలకు సక్రమంగా రికార్డులు ఉన్నా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమని,ఎవరైనా వాహనదారుడు లేదా తల్లిదండ్రులు మైనర్లు అయిన తమ పిల్లలకు వాహనాలు ఇస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమైతే అందుకు పూర్తి బాధ్యత వహనదారుడే వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదానికి గురైనా ఇన్సూరెన్స్ పొందడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. కావున వాహనదారులు మైనర్లకు వాహనాలను ఇవ్వడంలో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు.

# అవినీతి పై యెంత వరకైనా సిద్ధం

### వైసిపి రెబల్ నేత గోకుల్ కృష్ణా రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 17-: అధికారాన్ని అడ్డంపెట్టుకొని అధికార పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న వినీతిని ఆపార్టీకి చెందిన రెబల్ నేత, వైసిపి జెడ్పిటిసి సభ్యుడు గోపవరం గోకుల్ కృష్ణా రెడ్డి స్థానిక ఎమ్మెల్యే శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి మున్సిపాలిటి వేదికగా చేస్తున్న అవినీతిని బయట పెట్టారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అవినీతి చిట్టాను గోకుల్ కృష్ణారెడ్డి మీడియాకు వివరించారు. నంద్యాల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే తన ఇంటి పని మనిషి అయిన ప్రసాద్ ను మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా నియమించి... అతన్ని ఎమ్మెల్యే తన సొంత పనులకు, ఇంటి పనులకు వినియోగించుకుంటూ మున్సిపాలిటీ ద్వార జీతం తీసుకుంటున్నాడని గోకుల్ కృష్ణా రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంభందించిన వివరాలను ఎమ్మెల్యే ఇంట్లో పని చేస్తున్న ప్రసాద్ ఐరిష్ ద్వారా మున్సిపల్ కార్యాలయం వద్ద హాజరు వేస్తున్న ఫోటోను ఆయన మీడియాకు చూపించారు. గత కొన్నేళ్ళుగా నంద్యాల మున్సిపాలిటీ శిల్పా కుటుంబ కబంధహస్తాల్లో చిక్కుకుందని గోకుల్ కృష్ణా రెడ్డి ఆరోపించారు. ఇదే విధంగా నంద్యాల మున్సిపాలిటీలో చాలామంది శిల్పా సన్నిహితులు,.. మున్సిపల్ ఉద్యోగులుగా చలామణి అవుతున్నారని ఆయన ఆరోపించారు. మరి కొంతమంది వివరాలను సాక్ష్యం తో ఎమ్మెల్యే మున్సిపాలిటి ద్వార చేస్తున్న అవినీతిని బయటపెడుతామని గోకుల్ కృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. నంద్యాల మున్సిపాలిటీలో ఓ వార్డ్ కౌన్సిలర్ భర్త నిజాముద్దీన్ అడ్డదారిలో ఉద్యోగిగా కొనసాగుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయాన్ని గోకుల్ కృష్ణా రెడ్డి చెప్పారు. నంద్యాల



ప్రాంత ప్రజలు తమ కష్టాన్ని, పన్నుల రూపంలో డబ్బు చెల్లిస్తుంటే. ఎమ్మెల్యే ఆయన అనుచరులు అడ్డదారిలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని గోకుల్ కృష్ణా రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు బయటకు వస్తున్న అవినీతిని చూస్తుంటే.. ఇది కాదా? అవినీతి అని నంద్యాల ప్రజలు నవ్వుకుంట్టున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు, మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురువుతున్న ఎంఎల్యే ఏమాత్రం పట్టించోకోవడం లేదంటే. నంద్యాల పరిధిలో జరుగుతున్నఅవినీతి, భూ కబ్జాల వెనుక ఎమ్మెల్యే మాజీ మంత్రి హస్తం ఉంటుదని తాము భావిస్తున్నట్టు గోకుల్ కృష్ణా రెడ్డి ఆరోపించారు. ఎవడబ్బ సొమ్మని నంద్యాల ప్రజలు పన్ను రూపంలో చెల్లించిన డబ్బును తమ ఇంటి మనుషులకు, అనుచరులకు ఎలా పంచిపెడతారని గోకుల్ కృష్ణా రెడ్డి, స్టానిక ఎమ్మెల్యే శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. నంద్యాల మున్సిపాలిటిలో జరుగుతున్న అవినీతి పై తాను యెంత వరకైనా వెళ్ళడానికి సిద్ధమని గోకుల్ రెడ్డి స్పష్టం చేశారు.

# సంస్మరణ సభకు అందరూ రండి....

.విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 17 సోమవారం 19వ తేదీ ఉదయం 10: 30 గంటలకి ప్యాపిలి పట్టణం లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్ హాల్ నందు సంస్మరణ సభ మాజీ కమ్యూనిస్టు నాయకులు ప్రస్తుత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కలచట్ల వెంకటేశ్వర్లు మరియు ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు రామచంద్రుడు గార్ల సంస్మరణ సభ నిర్వహించబడుచున్నది కావున పార్టీలకు అతీతంగా బంధువులు మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ కూడా రావలసిందిగా కుటుంబ సభ్యులు మరియు కలచట్ల గ్రామస్తులు కోరారు.



## ఎన్నికల సన్నద్ధత ప్రణాళిక సిద్ధం చేయండి జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి :-17-2024 సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత నిర్వహణ ప్రక్రియను ప్రణాళిక రచనతో వేగవంతంగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్డా. కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల సంసిద్ధతపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

## రుణ వ్యాపారస్తులపై కట్టిన చర్యలు తీసుకోవాలి..



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 17 డిజిపి పై గవర్నర్కు ఫిర్యాదు నంద్యాల జిల్లా వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ ఏఈ నాగరాజు డోన్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేట్ ఆన్లైన్ రుణయాకుల యజమాన్యాల వేధింపులకు గురై వేలాదిమంది చనిపోవడం జరిగినదిరుణ బాధితుల నుండి మాకు అభ్యర్థులు వచ్చి ఉంటే మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కి 23 11 2022వ సంవత్సరము ఫిర్యాదు ఇచ్చి ఉన్నాము ఆపిర్యాదులకు స్పందించిన గవర్నర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపి కి మా అభ్యర్థనను పంపి ఉన్నారు తేదీ 19 122022వ తేదీ అయితే ఇంతవరకు డిజిపి రాష్ట్రంలో రుణ వ్యాపారస్తులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు రాష్ట్రంలో ఉన్న ఎస్పీలకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదు రోజురోజుకీ రుణ బాధితుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి ఒక నెల కిందట కర్నూలు జిల్లాలో కార్పొరేటర్ గారి వేధింపులకు గురి అయ్యి మున్సిపల్ సిబ్బంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడం జరిగినది. డోన్ పట్టణంలో ముస్లింలు వ్యక్తి ఉరి వేసుకోవడం జరిగినది ప్రముఖ దినపత్రికలలో కూడా వార్తలు వచ్చాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల సంఘం కమిషన్ ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదు దినపత్రికలో వచ్చిన వార్తలకు సైతం మానవ హక్కుల సంఘం సుమోటోగా తీసుకొని దర్యాప్తు కొనసాగించాలి మానవ హక్కుల సంఘం కూడా ఏమాత్రం కూడా చర్య తీసుకోవడం లేదు మేము డోన్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి రాష్ట్ర గవర్నర్ గారికి రిజిస్టర్ పోస్టు ద్వారా తిరిగి శుక్రవారం రోజు రిజిస్టర్ పోస్టు ద్వారా విజయవాడ గవర్నర్ గారికి పంపి ఉన్నాము ఇదే విధంగా రాష్ట్రంలో రుణ బాధితులకు రక్షణ కల్పించకపోతే రాష్ట్ర డిజిపి గారిపై హైకోర్టు చీఫ్ జస్టిస్ గారికి ప్రజా వైద్యాల కింద ఫిర్యాదు చేస్తామని ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీస్ శాఖ వారు రుణ బాధితులకు మానసిక ధైర్యాన్ని కలిగించాలని ఆత్మహత్యలకు పాల్పడకుండా మానసిక ధైర్యాన్ని అందించాలని ఆన్లైన్ రుణ వ్యాపారస్తులపై చర్యలు తీసుకుని వారిని కస్టడీలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా ఏఈ నాగరాజు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వినియోగదారుల సంఘాల నాయకులు చిన్న మద్దయ్య నాయుడు శ్రీరాములుతదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190